# ఆంధ్ర నాటకరంగము

శ్రీయుత దేవులపల్లి
వెంకట లక్ష్మీనరసింహారావు గారు

ఆంధ్రమున రసాత్మకము లయిన నాటకములు నిజముగా కడు కొద్దిగా నున్నవి. చక్కని, మంచినాటకములు–ప్రదర్శన యోగ్యములయిన నాటకము లింకను వ్రాయబడవల



శ్రీయుత దేవులపల్లి వెంకటలక్ష్మీనరసింహారావుగారు

యును. నాటకములును, నాటక ప్రయోగములును గూడ నాంధ్రమునందు ఒకకొంతవరకు పెరిగి పిమ్మట అభివృద్ధి గాంచలేక 'గిడస' బారినరీతి, మడగుజ్జువాని శరీరమువలె నయిపోయినవి. అయినను ఇపుడున్న నాటకములలో కథానైజముచేతనే రసపూరితములయిన రంగములుగలవి కొన్ని కలవు. అట్టి వుండుట బట్టియే ఆనాటకప్రదర్శనము లెంతపాడువారుచున్నను భావనచేత ప్రేక్షకులు నటులు తెచ్చిపెట్టిన కొరంతలేకుండ జేసికొనగలుగుచున్నారు. అందువలన కొన్ని నాటకము లెన్నిసారులు ప్రయోగించినను, ఎట్టినటులాడినను రసవిహీనములయి పాడువారుటలేదు. చిత్రనళీయమున బాహుకుని వియోగ సంతాపమును, సారంగధరనాటకమునందు చిత్రాంగి మనోవేదనయు, హరిశ్చంద్రుని కథయందు ఆపదచ్యుత సార్వభౌముని దుఃఖార్తులును, రామదాసునందు గోపన్నగారి భక్తిపారవశ్యమును, అమాయకపు విశ్వాసమును ఆంధ్రుల రక్తనాళములందు రక్తముతోపాటు జీర్ణించిపోయి ప్రవహించుచున్నవి. ఇంకను ఇట్టియుదాహరణము లెన్నియేని యీయావచ్చును.

తాను ధరించుపాత్రను అనుభవముచే తెలుసుకొని యందు లీనమైపోయి తన్మయత్వమునటించు భావనామూర్తియు, అనుభవజ్ఞుడునగువాడే నిజమయిన నటు డనిపిలుచుకొనును. అనుభవ, భావనలలో నేది లోపించినను నటుని అభినయము, నటన పరిపూర్ణత్వమును పొందనేరవు. నటుడు తన జీవితమునం దనుభవించిన కష్టసుఖము లయనుభవసారమైన రసములను మాత్రమే భావనాప్రజ్ఞ చేత నినుమడింపజేసి ప్రదర్శింపగలడు. కావున ప్రతినాట్యజీవియు అన్నిరసములను ప్రకటింపజాలడు. అన్నిరసములను సమముగా ప్రక

టింపజాలిన నటు లెవ్వరయిన రసమూర్తులు ఒక రిద్ద రెక్కుడయిన నుండవచ్చును. అట్టి వారు మహాప్రతిభాశాలురు. వారి జీవితము కేవలము రసాత్మక మైనదిగా నుండును. సాధారణముగా ప్రతినటుడును తనప్రకృతికి సహజము లయిన రసములనే బాగుగా నటింపగలడు.



బాహుకుడు
"ఆహా! దమయంతీ! నీ నలు నిట్లు పరిభవింతువే!"

ఈ కాలపు నటులలో మనము సాధారణముగా జూచు నాటకములలో చిత్రనళీయము నందు నలునిపాత్రమును కడునేర్పుతో నించు మించుగా సమానముగా నిర్వహించిన నటు లనేకులను గాంచితిని. కాని, బాహుకపాత్ర ముతో సంపూర్ణముగా నైక్యమయిపోయి ప్రదర్శించిన నటులలో శ్రీయుత దేవులపల్లి వెంకటలక్ష్మీనరసింహారావుగారివంటి నటులను ఇంకొకరిని గాంచియుండలేదు. బాహుకుడు వీరియందు మూర్తీభవించినట్లుండును. వీ రా పాత్రకు ఒప్పినట్లు ఒరు లొప్ప యుండలేదు. కేవలము అనుభవైకవేద్యము లయిన రసభావములను, ప్రియభార్యావియోగము వలనను, ఆమె కపట ద్వితీయస్వయంవరవార్త వినుట వలనను, అసలే క్రుంగిపోయిన జీవితమున సంతాపవహ్నిచే రగులుకొనిపోవుచున్న హృదయభారమువల్లను జనించు దురంత దుఃఖభావ తరంగములను భావనామూర్తు లయిన నరసింహారావుగారు అత్యద్భుతముగా నటింతురు. బాహుకవేషము వీరిసొమ్ము. వీరి ప్రకృతిలో బాహుకుని నిర్వేదము, దైన్యము, బలవత్తరవిధి యిమిడియున్నవి కాబోలు!

నరసింహారావుగారియందు రామదాసు పాత్రము గూడ రసస్ఫూర్తి జెందియుండును. నామిత్రులు సూరిశాస్త్రిగారు రామదాసుని గూర్చి వ్యాఖ్యానముచేయుచు వ్రాసిన యంశములు వీరి నటనయందు మూర్తీభవించి యుండును. నరసింహారావుగారి రామదాసునకు రాముడు కంటికి కగపడును. వారి భక్తిస్వభావములో బాలకచేష్ట లగుపడును. రాముని, తనతో ఆడుకొను సైదోడువలె, తమ్ముని వలె, ముద్దులమఱదివలె, గొప్ప గుణరాశివలె, సకల సద్గుణసంపన్నుడగు స్నేహితునివలె భావించి, భక్తిపారవశ్యముతో ధ్యానము

చేయుచు రామదాసునడకల నడతురు. వీరు



రామదాసు

"ఆ! రామా! వచ్చితివా! కరుణకల్గెనా!......"

మొదటినుండియు రాముని వశపరచుకొను చిత్తవృత్తి నగపరుచుచు నడుమ నడుమ భక్తి భావపరంపరల తేలి యాడుచు, అప్పటప్పుడు దుర్భరదుఃఖాతిశయముచే కలిగిన నాస్తికపుట విశ్వాసమును గనబఱచుచు తుదకు మనోవీధి యందు రామసాక్షాత్కారము కలిగినపుడు జనించు ఆనందమును మహాద్భుతముగ జూప గలరు. భక్తిపరవశులయి అడుగడుగునకు రామ నామసంకీర్తనము జేయుచు నటించునపుడు వీరిని జూచినవారు రామదాసుయొక్క అపరావ తారమా యని భ్రమింతురు.

నరసింహారావుగారు ప్రతిబింబింపజేయు పాత్రలలో నూతనమైనది నందసామ్రాజ్య వినాశకుడైన చాణక్యునిది. ఈపాత్ర నిదివర కెవ్వరును ప్రదర్శించియుండలేదు.(?) చాణక్యు డుమహాప్రతిభాశాలి; ప్రతిహింసాపరాయణుడు; బ్రాహ్మణాభిమాని; బ్రాహ్మణోత్తముడు; చంద్రగుప్తునిచేత మౌర్యసామ్రాజ్యము స్థా పింపజేసి నేలించిన ఆచార్యుడు; ఒకసారి బ్రాహ్మణప్రధానము సకల భారతవర్షమున కును కన్నులకు మిరుమిట్లు గొలుపునట్లుచేసిన



చాణక్యుడు

"ఒకనాడీ భిక్షుకునిపాదములపై బడి ప్రాణ భిక్ష పెట్టుమని ప్రార్థించెదవు! నేను నీ కాభిక్ష పెట్టను......"

అసాధారణప్రజ్ఞాన్వితుడు. కపిలుని తేజమును, భార్గవుని క్షాత్రమును, అగస్త్యుని మహాసామర్థ్యమును చాణక్య మంత్రియందు మూర్తీభవించియున్నవి. అట్టిచాణక్యుని నరసింహారావుగారు ప్రదర్శించునపుడు చూపఱులకు భయవిషాదసంభ్రమములు ఒక్కసారిగా కలుగుచుండును. వీరి చాణక్యపాత్రను ఆంధ్రలోకము ఇంకను బాగుగా నెఱుగదు. సహజముగ వీరు డాంబికవేషధారులు గాకపోవుట చేత పెక్కుమంది వీరి నెఱుగరు. మూరుమూలల దాగియున్నను నరసింహారావుగారి నటనాసామర్థ్యము ఎప్పటికైనను వెల్లడి కాకపోదు. వీరి బాహుకుని వేదనయందు గల నిస్పృహాతకును, రామదాసునందు గస్పట్టు అమాయకపు భక్తివిశ్వాసములకును, చాణక్యుని జీవితమునం దంతర్వాహినియై ప్రవహించు తీవ్ర మనఃక్షోభమునకును ఏదోయొక అపూర్వసంబంధ ముండవలయును. లేకున్న ఈమూడు ప్రవృత్తులును నరసింహారావుగారియందు మూర్తీభవించియుండుట పొసగియుండదు. ఆప్రకృతి యేదో—గ్రహింప వీలులేనిది—నరసింహారావుగారి పాత్రధారణకు వన్నె దెచ్చుచున్నది.

[ధావరాజు వెంకటకృష్ణరావు.]

---

# సౌందర్యలహరి

పెమ్మరాజు లక్ష్మీపతిగారు

అరయఁగ నిన్నుఁ గూడిన నజాండముఁ గల్పన సేయఁ జాలు నీ
శ్వరుఁ డటు గానిచోఁ గదలఁ జాలఁడుగా నదుగైనఁ దల్లిరో!
హరిహరపద్మసంభవముఖామరసేవిత హా భవత్పదాం
బురుహము లంటఁగా నకృతపుణ్యుఁడ నేగతి నేర్చువాఁడనో!

ఎంచఁగ నీదుపాదరజ మించుక దాగ్రహియించి మించి ని
ర్మించుచు నున్నవాఁ డల విరించి జగంబుల నెల్ల విష్ణుఁ డ
భ్యంచితలీల మస్తకసహస్రముపై ధరియించుదాని న
ప్పంచశరారి దేహమున భస్మము లీల నలందు దానినే!